

ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు



బాలానగర్ పారిశ్రామిక వాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు రాజశేఖర్, కార్మిక నాయకులు



ఆస్పత్రి ఆవరణలో ఆందోళన చేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, ఏఐటీయూసీ నాయకులు



జీడిమెట్లలోని ర్యాలీలో ఐఎన్‌టీయూసీ నాయకులు

బీజేపీకి బుద్ధి చెప్పాలి

- ప్రజా సమస్యలు పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం
- గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చని వైనం
- దేశవ్యాప్త సమ్మెలో వివిధ రంగాల కార్మికుల ర్యాలీ

దుండిగల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం పిలుపు నిచ్చారు. కేంద్ర బీజేపీ కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం గండి మైసమ్మ చౌరస్తాలో వివిధ రంగాల కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు గడిచినా, రైతాంగ, కార్మిక, వర్గ ప్రజా సమస్యలను పరిష్కరించడం లేని మండిపడ్డారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క వాగ్దానాన్ని కూడా అమలు చేయలేదని ఎద్దేవ చేశారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులను నిర్వీర్యం చేస్తున్నారని, 12 గంటల పని విధానాన్ని అమలులోకి తెస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా కార్మికులందరూ పోరాటాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. కార్మికులందరికీ కనీస వేతం రూ. 20వేలు వేతనం ఇవ్వాలని, పెన్షలు నెలకు రూ.10 వేలు ఇవ్వాలని ప్రతి కార్మికుడుకి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సీఐటీయూ దుండిగల్, గండి మైసమ్మ కన్వీనర్ బొడిగె రామస్వామి, సత్యం, వీరమల్లు, నర్సింహ, ఎల్లయ్య, సూరి, జగన్, రాధహంస, విజయపార్వతి, అమృత, బాల మణి, నవనీత, రవి, లక్ష్మయ్య దుర్గేష్, శ్రీను, ఐఎఫ్‌టీయూ నాయకులు యాకూబ్, లక్ష్మయ్య, సత్యనారాయణ, విజయ్, చంద్రయ్య, భిక్షపతి, వీరితో పాటు మున్సిపల్ కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాన భోజన కార్మికులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు హమాలి కార్మికులు, వివిధ పరిశ్రమల్లో పని చేసే కార్మికులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్‌లో..

నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి పారిశ్రామిక ప్రాంతం, బాచుపల్లి మెయిన్‌రోడ్డు బొల్లారం చౌరస్తాలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ, ఏఐటియూసీ, సీఐ టీయూ, ఏఐసీటీయూ నాయకులు కోటేశ్వరరావు, ఏసురత్నం, చంద్రశేఖర్, రాంబా మాట్లాడారు. స్వామి నాథ కమిషన్ సిఫారసుల మేరకు రైతులు పండించిన పంటకు, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర నిర్ణయించే విధంగా చట్టబద్ధత కల్పించాలన్నారు. ఏఐటీయూసీ పి.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో ఏసురత్నం, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఎంఎన్ రెడ్డి, స్వామి, కోటేశ్వరరావు, నారాయణ, రాంబాబు, బ్రహ్మానందం, కార్మికులు పాల్గొన్నారు.



గండిమైసమ్మ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, వివిధ సంఘాల నాయకులు

- **చందానగర్:** కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ వామపక్ష పార్టీలు, ఏఐటీయూసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చందానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి లేబర్ అడ్డావరకు ర్యాలీ నిర్వహించారు. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సి.శోభన్, మాణిక్యం, కె.కృష్ణ, రామకృష్ణ, చందు యాదవ్, తుకారాం, దానయ్య, నారాయణతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.
- **బాలానగర్:** బాలానగర్ పారిశ్రామిక వాడలో 300 మంది కార్మికులు, కార్మిక సంఘాల నాయకులతో భారీ ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, సీఐటీయూ నాయకులు వెంకట నర్స య్య, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి చైతన్యరెడ్డి, నాయకులు శంకర్, కార్తీక్, రమణ, మల్లేష్, యాదవ్‌రెడ్డి, భాషమ్మ, మౌనిక, పుష్ప, సంగీత, లక్ష్మి, సౌజన్య, సారిక, వినోద, శ్వేత, స్రవంతి, శ్రీదేవి, యమున పాల్గొన్నారు.
- భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు శుక్రవారం ప్రశాంత్‌నగర్ పారిశ్రామిక వాడలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు ఏసురత్నం, జిల్లా కార్యదర్శి శ్రీను, సీఐటీయూ కార్యదర్శి కృష్ణనాయక్, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి'

గచ్చిబౌలి: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న తమకు జీవో ప్రకారం 13,600వేతనం ఇవ్వాల్సి ఉండగా కేవలం 11,000 మాత్రమే చెల్లిస్తున్నారని, ఇది కూడా మూడునాలుగు నెలలకోసారి ఇస్తున్నారని అన్నారు. నెలనెల వేతనం ఇచ్చేలా చూడాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ. 13.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు శ్రావణిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్‌యాదవ్, రాజు, భాగ్య, మల్లేశ్వరి, అనిత, లక్ష్మి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా ప్రొఫెసర్ నాగరత్న

- ఇద్దరు ప్రొఫెసర్లను డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు



ప్రొఫెసర్ నాగరత్న, ప్రొఫెసర్ రజని

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరీక్షల విభాగం కంట్రోలర్‌గా కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ ఎం.నాగరత్న నియమితులయ్యారు. ప్రస్తుతం అదనపు కంట్రోలర్‌గా ఉన్న ఈమెను కంట్రోలర్‌గా ప్రమోట్ చేస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతిగా ఉన్న ప్రొఫెసర్ ఎ.రజనీని యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెల్(యూఐసీసీ) డైరెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం అకడమిక్ ఆడిట్ సెల్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ తారాకళ్యాణిని.. అదే పోస్టులో పూర్తి స్థాయి డైరెక్టర్‌గా నియమిస్తున్నట్టు రిజిస్ట్రార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా నియామకాల నేపథ్యంలో ఖాళీ అయిన ఈసీఈ విభాగాధిపతి, అదనపు కంట్రోలర్ పోస్టుల్లో ఎవర్నీ నియమించకపోవడం పట్ల సీనియర్ ప్రొఫెసర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కొంత కాలంగా యూనివర్సిటీలో కీలకమైన పోస్టుల్లో జూనియర్ ప్రొఫెసర్లను నియమిస్తూ యాజమాన్యం తీసుకుంటున్న నిర్ణయాలను సీనియర్లు ఆక్షేపిస్తున్నారు.

నేడు జేఎన్‌టీయూలో 'మేథో సంపత్తి హక్కుల'పై జాతీయ సెమినార్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మేథో సంపత్తి హక్కుల అంశంపై శనివారం జేఎన్‌టీయూ గోల్డెన్ జూబ్లీహాల్‌లో జాతీయ సెమినార్ నిర్వహించనున్నట్టు వర్సిటీ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పి.ప్రసన్న తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సెమినార్‌కు ముఖ్య అతిథులుగా వర్సిటీ వీసీ డాక్టర్ కట్టా నర్సింహరెడ్డి, ఐపీబీ సీఈవో దొప్పలపూడి అశోక్, అష్ల్యాండ్ ఎల్‌ఎల్‌సీ మేనేజర్ డాక్టర్ కోటిపల్లి ఫణికిరణ్ హాజరు కానున్నట్టు ఆయన పేర్కొన్నారు. శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం కానున్న ఈ సెమినార్‌లో ప్రధానంగా.. అంతర్జాతీయ మేధో సంపత్తి చట్టాలు, దేశంలో అభివృద్ధి పోకడలు-సవాళ్లు, యూనివర్సిటీల్లో అకడమిక్ పేటెంట్లు, పేటెంట్ డ్రాఫ్టింగ్ - మేనేజ్‌మెంట్.. తదితర అంశాలపై నిపుణుల ప్రసంగాలు ఉంటాయని వెల్లడించారు. వివిధ ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో పనిచేస్తున్న ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్ ఈ సెమినార్‌కు హాజరు కావచ్చని పీఆర్‌వో ప్రసన్న తెలిపారు.



- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డిని పూర్వ ఆల్విన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రికి ఆల్విన్‌కాలనీ భూముల విషయంలో గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల ఇళ్లస్థలాల సమస్యలను పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో ఆల్విన్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, నాగన్నగౌడ్ ఉన్నారు.

\- హైదర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి)

బండి సంజయ్‌ను కలిసిన నేతలు



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్

అల్లాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం సిరిసిల్ల జిల్లాలో బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ తలపెట్టిన పాదయాత్ర జయప్రదం కావాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. పర్వత్ నగర్‌లోని దుర్గా మల్లేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సంజయ్‌ను శ్రీనివాస్ కలుసుకున్నారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదర్శన్ ముదిరాజ్, నార్లపురం శ్రీనివాస్ ఉన్నారు.

ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్‌జాబ్ పేరుతో మోసం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్ అంటూ ఎస్ఎంఎస్ పెట్టి విడతల వారీగా భారీగా డబ్బు స్వాహా చేసిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిగూడలోని వేంకటేశ్వర పీజీహాస్టల్‌లో ఉంటున్న ఏ.ఎల్లారెడ్డి షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్‌గా పని చేస్తున్నాడు. అయితే ఈనెల 2వతేదీ పూజాసింగ్ అనే పేరుతో పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఎస్ఎంఎస్ వచ్చింది. తరువాత జాబ్ గురించి తెలపాలని తిరిగి సమాచారం పంపాడు. మీరు కొంత డబ్బు పెడితే తాము ఇచ్చే టాస్క్ పూర్తి చేసిన తరువాత రెట్టింపు డబ్బు వస్తుందని తెలిపింది. ఎల్లారెడ్డి రూ.1,046 రూపాయలు ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెట్టాడు. బిజినెస్ చెయ్యాలంటే రూ.10వేలు చెల్లించాలని సూచించారు. ఎల్లారెడ్డి పదివేలు చెల్లించిన తరువాత టాస్క్ ఇచ్చారు. ఆ తర్వాత రూ.18,869 బాధితుడి అకౌంట్‌లో వేశారు. ఇదే విధంగా మరో సారి రూ.13,531 చెల్లించాడు. మరోసారి రూ.34,810 వచ్చాయి. దీంతో మీరు టాస్క్ కొనసాగించేందుకు మరో రూ.10వేలు కట్టాలని చెప్పారు ఆడబ్బు కట్టిన తరువాత మీ పాయింట్లు తక్కువగా ఉన్నాయని మరో రూ.40 వేలు మరోసారి రూ. 40 వేలు చెల్లించాడు. ఆ తరువాత మరో రూ.55,526 వెంటనే చెల్లించాలని చెప్పటంతో మోసపోయానని గ్రహించిన ఎల్లారెడ్డి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

200 మందితో 108 సూర్య నమస్కారాలు



టీఎస్ఆర్ మాల్‌లో కొనసాగుతున్న సూర్య నమస్కారాలు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని టీఎస్ఆర్ మాల్‌లో శుక్రవారం రథసప్తమిని ఘనంగా నిర్వహించారు. సూర్య భగవానుడి జయంతిని పురస్కరించుకొని శివోహం యోగా రీసర్చ్ ఆధ్వర్యంలో ఒకే వేదికపై 200 మందితో 108 సూర్య నమస్కారాలు చేశారు. అనంతరం యోగా గురువు కె.రవీందర్ రాజు మాట్లాడుతూ రథసప్తమి ప్రాముఖ్యత సూర్య నమస్కారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నిత్యం సూర్య నమస్కారాలు చేయడంవల్ల ఎలాంటి అనారోగ్యాలు దరి చేరకుండా, సంపూర్ణ ఆరోగ్యం పొందుతారన్నారు. ఉరుకులు, పరుగుల జీవితంలో యువత వ్యాయామయం అనేది మరిచి పోయారని, చిన్న చిన్న కారణాలకే ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. సూర్య నమస్కారాలవల్ల ఒత్తిడిని దూరం చేసి, ప్రశాంతత పొందుతామని సూచించారు. కార్యక్రమంలో యోగా గురువులు నళిని మోహన్, బిల్లా లక్ష్మణ్, మధు ఉన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

హైదర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని వెంకట పాపయ్యనగర్ కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శివరాజ్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు రాందాస్‌గౌడ్, జనార్దన్‌రావు, జీవన్‌రెడ్డి, ఇశ్రాయిల్, నరసింహులు, జంగారెడ్డి, రామిరెడ్డి పాల్గొన్నారు.



యూజీడీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

సీసీ రోడ్డు పరిశీలన

బాలానగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధి ఫిరోజ్‌గూడాలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, రాంచందర్ యాదవ్, కృష్ణయాదవ్, శంకర్ గౌడ్, మహ్మద్ యాదవ్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

ముంపు సమస్య నివారణకు చర్యలు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి జోన్ పరిధిలో నెలకొన్న ముంపు సమస్య పరిష్కారానికి ముందుగా చర్యలు తీసుకుంటున్నామని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ అన్నారు. మూసాపేట సర్కిల్ పరిధిలోని కాముని చెరువు నాలా, సబ్దర్‌నగర్‌లోని సర్‌ప్లస్ నాలా, సున్నం చెరువు నాలా, ముళ్లకత్వ చెరువు నుంచి వెళ్లే నాలాను శుక్రవారం ఆమె జోనల్, సర్కిల్ స్థాయి అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షాకాలం నాటికి నాలాల్లో పూడికతీత పనులు చేపట్టాలని, నాలాల అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముంపు సమస్య వచ్చినప్పుడు అత్యవసర పరిస్థితుల్లో భాగంగా పునరావాస స్థలాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ చిన్నారెడ్డి, సిటీప్లానర్ ఉమాదేవి, ఉపకమిషనర్లు రమేష్, కృష్ణయ్య, ఈఈలు సత్యనారాయణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో నాలాను పరిశీలిస్తున్న జెడ్సీ అభిలాష అభినవ్, ఉన్నతాధికారులు

మరుగు దొడ్ల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ 127 డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్ బస్తీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ మరుగు దొడ్ల స్థలాన్ని సీపీఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఆదేశాలతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఐదు రోజుల్లో ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటన్న వారి కోరిక మేరకు గడువు ఇచ్చి, వ్యక్తిగత హామీ పత్రం రాయించుకున్నారు. ఆక్రమణను ఉపేక్షించేది లేదని, స్థానికుల అవసరాలకు ఉపయోగ పడేటట్టు చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 127 డివిజన్ సీపీఐ నాయకులు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య కాంగ్రెస్ నాయకులు ఉస్మాన్, ఆరీఫ్, బీజేపీ నాయకులు శివరాజ్, నర్సింగ్‌రావు, అర్జున్‌రావు, శివకుమార్, చంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



- మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నగరానికి వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధరరావు, మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కాంతారావు, నట్రాజ్ ఉన్నారు.

\- పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి)

ఏసీపీ శ్రీనివాస్‌రావుకు అభినందనలు



ఏసీపీకి బొకే అందజేస్తున్న నాయకులు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి డివిజన్ లా అండ్ ఆర్డర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాస్‌రావును శుక్రవారం పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, కాలనీల అసోసియేషన్ల సంఘాల ప్రతినిధులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛ అందజేయడంతో పాటు శాలువలతో సత్కరించారు.

కాంగ్రెస్‌లో చేరిక



దుర్గేష్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హైదర్‌నగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దుర్గేష్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. వారు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రెహమాన్, గోపాల్, రవి, శశిధర్, ఇస్మాయిల్, లింగం, సంగమేష్, శ్రీను, బాలు, రవి తదితరులు పాల్గొన్నారు.

బబ్బుగూడలో కార్పొరేటర్ పర్యటన

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ బబ్బుగూడలో శుక్రవారం కార్పొరేటర్ మహేందర్ పర్యటించారు. నాలా, పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బోడ శ్రీను, అంజనేయులు, ఎర్రస్వామి, శ్రీధర్‌గౌడ్, మణి, చిన్న, వెంకటేష్, సుందర్‌రావు, ఎండీ.కబీర్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు నీటిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు

అల్లాపూర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చెరువులోకి అక్రమంగా ప్రవేశించడం, చెరువు గట్టును ధ్వంసం చేయడం, చెరువులోని కలుషిత నీటిని హాస్టళ్లకు, హాస్పిటళ్లకు చట్ట వ్యతిరేకంగా తరలింపు వంటి అభియోగాలపై ముగ్గురిని అల్లాపూర్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం ఉదయం జీహెచ్ఎంసీ మూసాపేట సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ పి.సాల్మన్ ఇన్‌స్పెక్షన్ చేస్తుండగా చెరువులో ట్యాంకర్లను గమనించి, అక్రమ పనుల విషయాన్ని పోలీసులకు తెలిపి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై చెరువు నీటిని ట్యాంకర్లలో నింపుకొని అక్రమంగా విక్రయిస్తున్న కే.నాగరాజు, కే.వల్లేష్, కే.కృష్ణ అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు అధికారి తెలిపారు. వాల్టా చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడలి ఆత్మహత్య కేసులో అత్తింటివారికి రిమాండ్

జీడిమెట్ల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోడలి ఆత్మహత్యకు కారకులైన అత్తింటి వారిని జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హెచ్ఏఎల్ కాలనీకి చెందిన దేగల సంధ్యారాణి భర్త,అత్తింటి వారు పెట్టే వేధింపులు తట్టుకోలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి బాధ్యులుగా భావిస్తున్న భర్త దేగెల సంతోష్ బాబు, ఆడపడుచు కవిత, అత్త పుష్పమ్మ, మామ మధుసూదన్, సతీష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తేనెటీగల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తేనెటీగల దాడిలో గాయపడి చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాంత్, సలీం ఈనెల 14న కొంపల్లిలోని ఎస్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోని ఉన్న శ్రీకాంత్ అనే వ్యక్తికి చెందిన పొలంలో తిరుగుతున్నారు. సలీం(60)పై చింతచెట్టుకున్న తేనే టీగలు దాడిచేశాయి. ఈ ఘటనలో గాయపడిన సలీంను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

కేపీహెచ్‌బీకాలనీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు ఈనెల 18న నిర్వహించనున్నట్టు కేపీహెచ్‌బీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ జేఎస్ నారాయణరావు, ప్రధాన కార్యదర్శి మొర్ల రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. భగత్‌సింగ్ స్పోర్ట్స్ క్లబ్ పేరుతో ఆదివారం కేపీహెచ్‌బీ మూడోఫేజ్ బాల్ బ్యాడ్మింటన్ కోర్టులో ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 12 టీమ్స్ పాల్గొంటాయని పేర్కొన్నారు. విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేస్తామన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి'

గచ్చిబౌలి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో వాయు, శబ్దకాలుష్యం పెరిగిపోతుందని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ అన్నారు. లింగంపల్లి, తారానగర్ కూరగాయల మార్కెట్‌లో ప్రజలకు ఉచితంగా జ్యూట్‌బ్యాగులు అందజేశారు. ప్లాస్టిక్ నిషేదంపై విస్తృత ప్రచారం చేస్తూ జ్యూట్‌బ్యాగులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నర్సింహ, శ్రీనివాస్, దత్తుయాదవ్ పాల్గొన్నారు.

పాదయాత్ర

పేట్‌బషీరాబాద్: పర్యావరణ పరిరక్షణకు జీవవాయువును పెంచేందుకు ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ అండ్ బయోడిజిల్ డెవలప్‌మెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి కాలుష్య నివారణే ధ్యేయంగా సంగారెడ్డి నుంచి సీఎం క్యాంప్ ఆఫీసు వరకు చేపట్టిన పాదయాత్ర జీడిమెట్ల డివిజన్ పైప్ లైన్ రోడ్డు వరకు చేరుకుంది. ఎల్‌సీఆర్ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యవంతం చేసి,వారి భాగస్వామ్యంతో యుద్ధ ప్రాతిపదికన పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టాలని, ఆర్గనైజేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం ఇచ్చేందుకు సీఎం క్యాంప్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టామన్నారు.

యువతి ఆత్మహత్య

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): యువతి ఆత్మహత్యకు పాల్పడింది. యూసుఫ్‌గూడ యాదగిరినగర్‌లో నివసించే నందకుమార్, నూకారత్నం దంపతుల కుమార్తె పూజ(23) ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నది. ఈనెల 15న తల్లి నూకారత్నం ఇంటి పనులు చేసుకుంటూ ఉండగా పూజ గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత తల్లి పిలిచినా పలకలేదు. పూజ ఉరేసుకుని కనిపించింది. నిమ్స్ ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

హైదర్‌నగర్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ సెవెన్‌హిల్స్ పద్మావతి గోదా సమేవత వేంకటేశ్వరస్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రితో ముగిశాయి. ఉదయం ఆలయంలో బాలభోగ నివేదన, మహాపూర్ణాహుతి, స్వర్ణపుష్పార్చన, చక్రస్నానం పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం వశిష్ట శ్రీలక్ష్మి కర్రీస్ సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ మాడవీధుల్లో రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా సాగింది.

- **కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి ప్రశాంతినగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 16నుంచి 21వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ బీడీ రామారావు తెలిపారు. శుక్రవారం ఉదయం విష్వక్సేన పూజతో ప్రారంభమయ్యాయి.
- **రాయదుర్గం:** గచ్చిబౌలి నానక్‌రాంగూడ రంగ్‌బాగ్‌లోని రంగనాథస్వామి ఆలయ బ్రహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు స్వామికి అంకుర్పాన, పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. పల్లకీ సేవ నిర్వహించారు. ఈనెల 23వ రకు బ్రహోత్సవాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



స్వామివారికి చక్రస్నానం,



రథోత్సవం ఊరేగింపులో భక్తులు,



స్వామివారి పల్లకీ సేవలో భక్తులు